www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | గురు వారం 7 జూన్ 2022 | ఎడిటర్: గోనుకొండ పృధ్వీరాజు | సంపుటి - 07, సంచిక-87 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# ధరణి పోర్టల్‌ను రద్దు చేయాల్సిందే




- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రద్దు చేస్తాం
- ధరణి రికార్డుల్లో భూయజమానుల పేర్లు మాయం
- ఇబ్రహీంపట్నం కాల్పుల ఘటనకు 'ధరణి' పోర్టలే కారణం
- నష్టపరిహారం అడిగిన నిర్వాసితులను జైళ్లో పెడతారా
- గిరిజనుల పోడు భూములు లాక్కుంటున్నారు
- ఐకియాకు 15 ఎకరాలు ఏ లెక్కన కట్టబెట్టారు
- ప్రభుత్వమే భూకబ్జాదారు అన్న పిసిస చీఫ్ రేవంత్

**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** భూ వివాదాలకు కారణమైన ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ధరణిని అట్టహాసంగా ప్రారంభించిన లక్ష్మాపూర్ గ్రామంలో చాలా భూములు ధరణిలో లేవన్నారు. ఇబ్రహీంపట్నం కాల్పుల ఘటనకు 'ధరణి' పోర్టలే కారణమన్నారు. ప్రభుత్వమే భూ కబ్జాలు చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం భూ కబ్జాలకు

2

## ప్రపంచంలో మొత్తంగా భారత్‌లోనే పత్తి ఎక్కువ

- అమెరికాలో బేయర్ పత్తి పరిశోధన కేంద్రం సందర్శించిన మంత్రి
- పత్తిలో ఉత్పాదకపెంచడంపై అధ్యయనం చేస్తున్నామన్న నిరంజన్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** ప్రపంచంలో ప్రధాన వాణిజ్య పంటల్లో పత్తి ఒకటని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వస్త్ర పరిశ్రమకు అది మూలాధారమని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పండే నాలుగు రకాల పత్తిపంటల్లో 90 శాతం గాస్పియం హిర్సూటం రకానికి చెందిందే ఉంటుందన్నారు. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో ఉన్న బేయర్ పత్తి విత్తన, జన్యు పరిశోధన కేంద్రాన్ని మంత్రి నిరంజన్ రెడ్డి నేతృత్వంలోని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నదని అన్నారు. ప్రపంచంలో అత్యధికంగా భారత్‌లో సుమారు 6.2 మిలియన్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతున్నదని చెప్పారు. ఇండియాతోపాటు చైనా, అమెరికాలలో పత్తి ఎక్కువగా సాగవుతుందని చెప్పారు. భారతదేశంతోపాటు ప్రధానంగా దక్కన్ పీఠభూమి పత్తి సాగుకు అత్యంత

2

## రాష్ట్రంలో 4లక్షల 80 వేల పెన్షన్ల దరఖాస్తులు పెండింగ్

భువనగిరి ఎంపీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి, జూలై 6 (సమ సమాజం):** దళితబంధు ఎన్నికల వరకేనని, ఆ తర్వాత అసలు ఈ పథకాన్ని కొనసాగించలేరని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. దళితబంధు పథకానికి అమెరికా బడ్జెట్ కూడా సరిపోదని చెప్పారు. రాష్ట్రంలో 4లక్షల 80 వేల పెన్షన్ల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. బొమ్మల

2

## వానాకాలం వ్యాధులతో అప్రమత్తం

హెచ్చరించిన మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** వానాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం గా ఉండాలని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు మూడంచెల విధానం అనుసరించాలని సూచించారు. పంచా యతీ రాజ్ సహా ఇతర శాఖలు, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో వ్యాధుల పై అవగాహన కల్పించడం, వ్యాధి నిర్ధారణ, చికిత్స వేగంగా అందించడం వంటివి చేయాలన్నారు. మంగళవారం వెంగళరావు నగర్?లోని ఇండియన్ ఇని?స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీస్? నుంచి రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏ పరిధి జిల్లాల్లో సీజనల్ వ్యాధులపై మంత్రి హరీశ్ రావు టెలి కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ చేశారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటివి పూర్తి నియంత్రణలో ఉండేలా చూసుకోవాలన్నారు.

## విద్యార్థులకు పట్టెడన్నం కూడా కరువే

ఇదేనా బంగారు తెలంగాణ అంటూ బండి ట్వీట్



**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** టీఆర్ఎస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు పట్టెడన్నం కూడా పెట్టలేకపోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శించారు. పురుగులతో ఉన్న అన్నాన్ని పిల్లలకు పెడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. నువ్వు ఎల్లపెడ్తా అన్న బంగారు తెలంగాణ ఇదేనా.. చిన్నపిల్లలను కూడా గోస పెడ్తున్న నీ తీరు సాలు దొర..మంచి భోజనం కూడా పెట్టలేని నీ పాలనకు సెలవు దొర అంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు. కాగా నిర్మల్ జిల్లా భైంసాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పురుగుల అన్నం వండుతుండడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. అన్నం

2

## బంధువు అకౌంట్‌లోకి రైతుబంధు

అధికారి తీరుకు నిరసనగా రైతుల ఆందోళన



**మహబూబాబాద్, జూలై 6 (సమ సమాజం):** రైతుల బ్యాంకు అకౌంట్లలో వేయాల్సిన రైతుబంధు డబ్బులను ఓ వ్యవసాయశాఖ అధికారి తన తెలివి తేటలతో తన బంధువు అకౌంట్ లోకి ట్రాన్స్ ఫర్ చేశాడు. అతనిపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలంటూ మహబూబాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మూడు రోజులుగా బాధిత రైతులు ధర్నా చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం చెరువు తండాకు చెందిన 39 మంది రైతులకు రూ.12 లక్షల రైతుబంధు డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. అయితే..ఈ డబ్బులను లబ్దిదారుల బ్యాంకు అకౌంట్లలోకి ట్రాన్స్ ఫర్ చేయాల్సిన వ్యవసాయశాఖ అధికారి.. తన బంధువు అకౌంట్ లోకి ట్రాన్స్ ఫర్ చేశాడు. తమకు రైతుబంధు పథకం డబ్బులు పడటం లేదని వెళ్లి అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు సదరు అధికారి. దీనిపై బాధిత రైతులు పూర్తిగా ఆరా తీయడంతో అసలు విషయం తెలిసి అవాక్కయ్యారు. తమ డబ్బులను వ్యవసాయ శాఖ అధికారి తన బంధువు అకౌంట్ లోకి పంపించుకున్నాడని తెలిసి బాధితులు లబోదిబోమన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

2

## సామాన్యుడిపై గ్యాస్ బండ భారం

- మరో 50 రూపాయలు పెంచిన చమురు సంస్థలు
- మంచిరోజులు వచ్చాయంటూ కెటిఆర్ సెటైర్లు



**న్యూఢిల్లీ, జూలై 6 (సమ సమాజం):** సామాన్యుల నడ్డి విరిచేలా చమురు సంస్థలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. పెట్రోల్, డీజిల్‌తో పాటు గ్యాస్ ధరలను పెంచేస్తున్నాయి. మరోసారి గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండ్ ధర మరోసారి పెరిగింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల సిలిండర్ ధర 50కి పెంచుతూ చమురు కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో హైదరాబాద్‌లో డొమెస్టిక్ సిలిండర్ ధర 1055 నుంచి రూ. 1105కి చేరింది. పెంచిన ధరలు తక్షణం అమల్లోకి వస్తాయని వెల్లడించింది. ఢిల్లీలో రూ. 1053గా ఉంది. దేశ వాణిజ్య రాజధాని ముంబాయిలో రూ. 1002.50 నుంచి రూ. 1052.50, కోల్ కతాలో రూ. 1,029 నుంచి రూ.1,079కి చేరింది. చెన్నైలో రూ.1,058.50 బదులుగా రూ. 1,068.50 చెల్లించాల్సి ఉంటుంది. 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ. 8.50 తగ్గడం విశేషం. సాధారణంగా ప్రతి నెలా 1వ తేదీన వీటి ధరల్లో మార్పులు చేర్పులు ఉంటాయి. ఈ నెల 01న 19 కిలోల సిలిండర్ ధరను రూ. 183.50 మేర తగ్గించిన విషయం తెలిసిందే. పెరిగిన గ్యాస్ ధరలతో సామాన్యులపై ప్రతికూల ప్రభావం పడనుంది. అదేవిధంగా ఐదు కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.18 పెరిగింది. ఈ నెల 1న వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.198 తగ్గించిన విషయం తెలిసిందే. గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై మంత్రి కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మంచి రోజులు వచ్చేశాయ్.. అందరికి శుభాకాంక్షలు. వంటింటి గ్యాస్ లిండర్ ధరను కేంద్రం మరో రూ.50 పెంచేసింది. సిలిండర్ ధర పెంచి మహిళలకు ప్రధాని మోదీ కానుకగా ఇచ్చేశారు' అని ట్విట్టర్ వేదికగా స్పందించారు.

## చంద్రశేఖర్ గురూజీ హత్యపై సమగ్ర దర్యాప్తు

- ఇప్పటికే ఇద్దరు నిందితుల పట్టివేత
- కారాణాలపై లోతుగా అధ్యయనం చేస్తున్న పోలీసులు



**బెంగళూరు, జూలై 6 (సమ సమాజం):** అందరూ చూస్తుండగానే వాస్తు నిపుణుడుగా పేర్కొనే చంద్రశేఖర్ గురూజీ కర్ణాటకలోని ఓ హోటల్‌లో మంగళశారం దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ఆయనను ఎందుకు హత్యచేసి ఉంటారన్న దానిపై కూపీ లాగుతున్నారు. ఆయన ఉంటున్న హోటల్‌కి వచ్చినవారు చూస్తుండగా కత్తులతో ఇద్దరు వ్యక్తులు ఆయనను పొడిచి చంపారు. హోటల్‌లోని సిసిటివిలో రికార్డయిన ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హుబ్లి జిల్లాలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం ఈ ఘటన జరిగింది. నిందితులకోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వాస్తు నిపుణుడి కోసం కోసం భక్తుల్లా వేచిచూస్తున్న ఇద్దరు వ్యక్తులు కత్తులతో పొడిచి చంపారు. అనంతరం హోటల్ నుండి పారిపోయారు. బాగల్ కోట్‌కు చెందిన చంద్రశేఖర్ వ్యక్తిగత పనుల నిమిత్తం హుబ్లికి వచ్చినప్పుడు ఈ దారుణం జరిగింది. సరళవాస్తు ద్వారా రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల్లో ఖ్యాతి పొందిన చంద్రశేఖర్ గురూజీ దారుణ హత్య కలకలం రేపింది. ఆయన శిష్యులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారా అన్నది కూడా దర్యాప్తు చేస్తున్నారు.

## ఉమ్మడి జిల్లాలో వైభవంగా కాకతీయ సప్తాహం

- భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



**భూపాలపల్లి, జూలై 6 (సమ సమాజం):** కాకతీయ వైభవ సప్తాహ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. గణపురంలోని భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లను ఆయన సందర్శించారు. కాకతీయ సప్తాహ వేడుకలను నిర్వహించనున్న నేపథ్యంలో కోటగుళ్లను పరిశీలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏడురోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కాకతీయ వైభవ సప్తాహం వేడుకలను కోటగుళ్లలో ఈనెల 12న ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు పూర్తి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకల్లో పేరిణి, శివతాండవం, భరతనాట్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యమిస్తామన్నారు. కాకతీయుల చరిత్రపై చిత్రలేఖనం, వకృత్వ పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళి



**న్యూఢిల్లీ, జూలై 6 (సమ సమాజం):** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు దేశవ్ఆయప్తంగా ఘనంగ ఆనిర్వహించారు. ఢిల్లీలోని పార్లమెంటరీ సెంట్రల్ హాల్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నిర్వహించారు. శ్యామప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రధాని మోడీ నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు, ఎంపీలు పాల్గొన్నారు. పూలమాలలు వేసి శ్యామప్రసాద్ కు నివాళులర్పించారు. హైదరాబాద్ బీజేపీ ఆఫీస్‌లోనూ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ స్టేట్ చీఫ్ బండి సంజయ్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు. ముఖర్జీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా బీజేపీ నేతలు మొక్కలు నాటారు. దేశ ప్రజల కోసం నమ్మిన సిద్ధాంతం కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ కష్టపడ్డారని బండి సంజయ్ అన్నారు. ఒకే దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు ఉండొద్దని గట్టిగా పోరాడారని గుర్తు చేసుకున్నారు.

## సంపాదకీయం

# విద్యారంగంపై నిర్లక్ష్యం వీడాలి!

విద్యారంగంలో విప్లవం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా..మార్పులు మాత్రం కానరావడం లేదు. ఎందుకనో పాలకులు ఎవరు అధికారంలో ఉన్నా ఈ రంగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫీజుల దోపిడీపై గళమెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. కార్పొరేట్ స్కూళ్ల పేరుతో చేస్తున్న దోపిడీ అంతాఇంతా కాదు. తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక ప్రకటించినా ఎందుకనో అది పట్టాలకెక్కడం లేదు. ఎపిలో జగనన్న విద్యా కానుక తప్ప స్కూళ్ల బలోపేతం జరగలేదు. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చదివిన వారు మత్రమే టాపర్స్‌గా నిలుస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో గమనించాలి. దీనివెనక ఏదైనా గూడుపుఠాణి ఉందా అన్నది బయటపెట్టాలి. కార్పోరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై ఎబివిపి తెలంగాణ బంద్‌కు పిలుపిచ్చింది. ఏటా ఇది జరుగుతూనే ఉంది. అయినా ఫీజుల దోపిడీ పెరగుతోందే తప్ప ఆగడం లేదు. లెక్కాపత్రం లేకుండా వసూలు చేస్తున్నమొత్తాలతో మధ్యతరగతి ప్రజలు కుదేలవుతున్నారు. నిజానికి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తరవాత సిఎం కెసిఆర్ కులమతాలకు అతీతంగా విద్యను అందిస్తానని పలుమార్లు ప్రకటించారు. సామాన్యుడి నుంచి, రాజకీయనాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యావిధానంలో చదవాలన్న ఆకాంక్షను ప్రకటించారు. కులరహిత హాస్టళ్లు ఉండకూడదని కూడా చెప్పారు. ఇంతటి ఉదాత్తమైన పథకం ఎందుకనో ముందుకు సాగడం లేదు. నిజానికి ఇప్పటి వరకు సిఎం కెసిఆర్ చేస్తున్న పథకాలు ఒక ఎత్తయితే ఈ పథకం ఒక ఎత్తయ్యేది. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. అయితే ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉండగానే గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్లు ప్రారంభించడం, అనేక హాస్టళ్లను కొత్తగా చేప్టటడం వల్ల పథకం అటకెక్కిందనే భావించాలి. ఎపిలో సర్కార్ స్కూళ్లను బాగుచేస్‌ఆమని, విద్యాదీవెనతతో కిట్లు ఇస్తున్నామని చెప్పారు. ఇంగ్లీష్ మీడియాం స్కూళ్లుగా మారస్తున్నట్టు ఇరు రాష్ట్రాల సిఎంలు ప్రకటించారు. ప్రస్తుతానికి ఈ ప్రయత్నాలు కూడా మంచి ఫలితాలే ఇస్తాయని ఆశించాలి. హైదరాబాద్, తదితర పట్టణాల్లో కార్పోరేట్ స్కూల్ కల్చర్ వచ్చాక క్రీడలను పూర్తిగా విస్మరించారు. కేవలం ఇరుకుగదుల్లో పిల్లలను బందీలను చేశారు. పుస్తకాలను బట్టీ పట్టించడం తప్ప మరోటి వారికి తెలియకుండా చేస్తున్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఏక కాలంలో చదువులపై, ఆటలపై దృష్టి సారించలేరు. అటువంటి విద్యార్థులకు ఉన్నత చదువులలో రిజర్వేషన్ సౌకర్యం ఉండాలి. ఉద్యోగాలలో రిజర్వేషన్ల వల్ల క్రీడాకారులకు భవిష్యత్ ఉపాధికి హామీ ఉంటే క్రీడల్లో తమ పిల్లల్ని ప్రోత్స హించే తల్లిదండ్రుల సంఖ్య క్రమంగా పెరగడానికి అవకాశాలు ఉంటాయి. క్రీడలకు సరైన ప్రోత్సహకాలులేక ఎంతోమంది భావిక్రీడాకారులు మట్టిలో మాణిక్యాల వలే మిగిలిపోయారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు కూడా దినసరి కూలీలాగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. అయితే గతంతో పోలిస్తే విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. గురుకులాల ఏర్పాటు వల్ల సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి వచ్చింది. దానిని కాదనలేం. అలాగే క్రీడాకారులకు ఉద్యోగాల్లో 2శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధించేలా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోవాలి. విద్యారంగానికి ప్రభుత్వం కూడా అధిక బడ్జెట్ కేటాయింపులు చేసి వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి. తెలంగాణ రాష్ట్రం వచ్చాక గురుకుల విద్యాలయాలు పెరిగాయి. ఒక్కొక్క విద్యార్థిపై ఏటా ఒక లక్ష రూపాయలు వెచ్చిస్తున్నారు. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు లభిస్తున్నాయి. దాని వల్లనే తొలి సారిగా కార్పోరేట్ విద్యాసంస్థల పాతర్యాంకుల చరిత్రను తలకిందులు చేస్తూ ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు అగ్రస్థానం సాధిస్తున్నాయి. ఇది తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యాలయాల ద్వారా చేస్తున్న నిశ్శబ్ద విప్లవం. చదువుకుంటే నిరుద్యోగిగా మిగిలిపోతున్న ప్రస్తుత తరుణంలో ఉపాధికి తగ్గ చదువు దక్కేలా చేయాలి. అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను, కరికులమ్‌ను మార్చాలి. పాఠశాల స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి భవిష్యత్తులో సామాజిక మార్పునకు దోహద పడుతుందని రుజువు చేయాలి. అలాగే తమ ప్రతిభ ద్వారా దేశానికి, రాష్ట్రాలకి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల బాధ్యత. ర్యాంక్‌లు, మార్కులకోసం పోటీపడే ప్రస్తుత కాలంలో ఆటలు ఆడితే పిల్లలు పాడవుతారని, చదువుల్లో వెనకబడతారనే తల్లిదండ్రులు ఆలోచిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు క్రీడా సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి చూపించడం లేదు. దానికి కారణాలు కూడా లేకపోలేదు. గ్రామస్థాయిలో సరైన సదుపాయాలు లేకపోవడం, క్రీడలను ప్రోల్సహించేలా పరికాలు, క్రీడా సామాగ్రి లేకపోవడం, ఆడుకోవడానికి మైదానాలు లేకపోవడం వంటి కారణాలూ ఉన్నాయి. విద్యా సంస్థలు సైతం వీటిని ప్రోత్సహించడం లేదు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లో క్రీడాంశాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రిజర్వేషన్ సౌకర్యం వర్తించే విధంగా చూడాలి. నిజమైన క్రీడాకారులకు రిజర్వేషన్ల ఫలాలు దక్కేలా అన్ని శాఖలు సమిష్టి కృషి చెయ్యాలి. ఈ ఫలితాలు పొందిన క్రీడాకారులు భావి క్రీడాకారులను ప్రోత్సహించాలి. అలాగే ఫీజుల దోపిడీని అరికట్టేలా కఠినచర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రైవేట్ పెత్తనం పోగలదు.

**పృద్విరాజ్ గోసుకొండ**
**ఎడిటర్**

# ప్రపంచంలో మొత్తంగా భారత్‌లోనే పత్తి ఎక్కువ



(మొదటి పేజి తరువాయి) అనుకూలమని వెల్లడించారు. దేశంలో 2030 నాటికి పత్తి ఉత్పత్తి 7.2 మిలియన్ టన్నులకు చేరుందన్నారు. 2002 నుంచి పురుగులను తట్టుకునే బోల్‌గార్డ్ రకం హైబ్రీడ్ పత్తి సాగవుతుందని, దీంతో పంట ఉత్పాదకత పెరిందని తెలిపారు. బేయర్ విత్తన సంస్థ అనేక దేశాల్లో పరిశోధనలు జరిపి అక్కడి వాతావరణ, భూ పరిస్థితులకు అనుకూలమైన ఎక్కువ దిగుబడినిచ్చే రకాలను అందిస్తున్నదని చెప్పారు. పత్తిసాగులో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, ఉత్పాదకత పెంచడంతోపాటు పంటకోతలో ఉన్న సమస్యలను సరళీక రించేందుకుకు అమెరికాలో అధ్యయనం చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణకు పత్తి, మొక్కజొన్న, కూరగాయల రకాల్లో నూతన వంగడాలను అందించేందుకు బేయర్ సంస్థ సంసిద్ధత వ్యక్తంచేసిందన్నారు. అమెరికాలో వ్యవసాయ కమతాలు పెద్దవికావడంతో వారు యాంత్రీకరణతో అద్భుతాలు సృష్టిస్తున్నారని తెలిపారు. తక్కువ విస్తీర్ణంలో తక్కువ రోజుల్లోనే అధిక ఉత్పత్తి సాధిస్తున్నారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కూడా పత్తు సాగు, వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తుందన్నారు.

# డోలో 650 కంపెనీలపై ఐటి దాడులు

### పలుచోట్ల 200 మంది అధికారులతో సోదాలు




**బెంగళూరు, జూలై 6 (సమ సమాజం):** నగరంలోని ఔషధ తయారీ కంపెనీ మైక్రో ల్యాబ్స్ లిమిటెడ్ కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. దాదాపు 20 మంది అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. ఈ కంపెనీ డోలో-650 ఔషధాన్ని తయారు చేస్తుందనే సంగతి తెలిసిందే. ఆదాయపు పన్ను శాఖలోని విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం, దేశవ్యాప్తంగా 40 చోట్ల దాదాపు 200 మంది అధికారులు ఈ కంపెనీ కార్యాలయాల్లో సోదాల్లో పాల్గొన్నారు. న్యూఢిల్లీ, సిక్కిం, పంజాబ్, తమిళనాడు, గోవాలలోని కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. ఈ కంపెనీ సీఎండీ దిలీప్ సురానా, డైరెక్టర్ ఆనంద్ సురానాల నివాసాల్లో కూడా సోదాలు చేస్తున్నారు. బెంగళూరులోని మాధవ నగర్, రేస్ కోర్స్ రోడ్డులో ఉన్న మైక్రో ల్యాబ్స్ లిమిటెడ్ కార్యాలయంలో కొన్ని దస్తావేజులను ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 2020లో కోవిడ్-19 మహమ్మారి ప్రారంభమైనప్పటి నుంచి ఈ కంపెనీ 350 కోట్ల మాత్రలను విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థులందరినీ అణగదొక్కి రూ.400 కోట్లు సంపాదించినట్లు సమాచారం.

# రాష్ట్రంలో 4లక్షల 80 వేల పెన్షన్ల దరఖాస్తులు పెండింగ్


(మొదటి పేజి తరువాయి) రామారం మండలం రామలింగంపల్లి గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహంతో పాటు మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. ఆ తర్వాత వాటర్ ఫిల్టర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అహ్మదాబాద్ ను ఆదానిబాద్‌గా చేసుకో అంటున్న మంత్రి కేటీఆర్ తెలంగాణలో చేస్తుంది అదేకదా అని ప్రశ్నించారు. ఒరిస్సాలోని నైని కోల్ మైన్ ను కేంద్ర ప్రభుత్వం సింగరేణి కంపెనీకి అప్పగిస్తే 20 వేల కోట్లు ఉన్న కాంట్రాక్టు 60 వేల కోట్లకు పెంచింది కేసీఆర్, కేటీఆర్ అని ఆయన ఆరోపించారు. రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా హైదరాబాద్ వస్తే ప్రభుత్వ ధనం 50 కోట్ల రూపాయల ఖర్చు చేసి హోర్డింగ్స్ ఏర్పాటు చేశారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఒక ఉద్యోగం రాలేదు, వృద్ధులకు పెన్షన్ ఇవ్వలేదు, నీవు తొమ్మిదేళ్లలో ఊరికి 9 ఇళ్లు అయినా కట్టావా ? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 4 లక్షల 80 వేల పెన్షన్ల దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని ఆయన చెప్పారు.



# మిస్టర్ ఎమ్మెల్యే

## ప్రశ్నించే జర్నలిస్టులపై కేసులా ?

**వాస్తవాలను ఎత్తిచూపి వార్తలు ప్రచురించినందుకు పత్రికా ఎడిటర్ పృద్విరాజు.జి పై కేసులు పెట్టించడం మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి తగునా !**







నల్లగొండ, జూలై 6 (సమ సమాజం): జాడ ఉండదూ.. జవాబుదారి తనం అస్సలు ఉండదు. ఎన్నికలలో గెలిచిన తరువాత మునుగోడు నియోజకవర్గం ప్రజల వైపు అస్సలు కన్నెత్తి చూడని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇప్పుడు ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై కేసులు పెట్టేందుకు సిద్దమైండు.

**సమ సమాజం పత్రిక ఎడిటర్ గోసుకొండ పృద్విరాజ్ సూటి ప్రశ్నలు...**

"మీరు కాంగ్రెస్ పార్టీ వారికి మాత్రమే ఎమ్మెల్యేనా...? లేక అన్ని పార్టీల ప్రజలకు ఎమ్మెల్యేనా?" సమాధానం చెప్పగలవా?. మీకు అధికారిక భవనం ఉంది దానిని ఓపన్ చేయించటం తెలియదా?, నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం తెలియదా?, నియోజకవర్గంలోని ప్రజలు ఎమ్మెల్యేని కలువాలంటే ఎక్కడ కలువాలి?, సమస్యలను ఎలా విన్నవించుకోవాలి?, అస్సలు "మీరు ఏ పార్టీలో ఉన్నారో మీ అంతరాత్మకైనా తెలుస్తుందా?"..



ఇలాంటి దుస్థితిలో మీరు ఉండి... మీకు మీ బాధ్యతను తెలియజేసిన మా అక్షర వెలుగు పత్రికను అబసుపాలు చేస్తారా!. డబ్బా.. పలుకుబడి ఉందికదా అని విచ్చలవిడి రాజకీయాలు చేస్తే ఖబర్దార్.. మునుముందు మునుగోడు నియోజక వర్గ ప్రజలు చక్కటి గుణపాఠం చెబుతారు జాగ్రత్త.



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై వరుస కథనాలు....రేపటి నుంచి

# బంధువు అకౌంట్‌లోకి రైతుబంధు



(మొదటి పేజి తరువాయి) అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో మూడు రోజులుగా కలెక్టరేట్ కార్యాలయం ఎదుటే ఆందోళన చేస్తున్నారు. ఆందోళన విరమించకపోతే కేసులు నమోదు చేస్తామని పోలీసులు తమనే బెదిరిస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. తమకు న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు రైతులు.

# విద్యార్థులకు పట్టెడన్నం కూడా కరువే

(మొదటి పేజి తరువాయి) తినక పస్తులు ఉండడంతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో విద్యార్థుల పేరెంట్స్ పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. అయితే ఈ ఘటనపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. నిర్మల్ కలెక్టర్ ముషారఫ్ అలీకి ఫోన్ చేసి ఆరా తీశారు. నివేదిక ఇవ్వాలని విద్యా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇక ఇటువంటి ఘటనలు మరోసారి పునారవృతం కాకుండా చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

# నగరంలో మరో కంపెనీ కుచ్చుటోపీ

### నిరుద్యోగుల నుంచి భారీగా వసూళ్లు

### రాత్రికి రాత్రే బిచాణా ఎత్తివేత

**హైదారాబాద్, జూలై 6 (సమ సమాజం):** నగరంలో మరో కంపెనీ నిరుద్యోగులకు కుచ్చుటోపీ పెట్టింది. లక్షల జీతంతో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కోట్లు వసూలు చేసి బిచాణా ఎత్తేసింది. మంచి ఉద్యోగం దొరుకుతుందని ఆశపడి లక్షల రూపాయలు చెల్లించిన యువతీయువకులు మోసపోయామని తెలుసుకుని పోలీసులను ఆశ్రయించారు. అమీర్ పేట డిజినల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసిన కేటుగాళ్లు నిరుద్యోగులకు గాలం వేశారు. ఆన్ లైన్ జాబ్, వర్క్ ఫ్రం హోం, యూఎస్ బేస్డ్ కంపెనీ ఉద్యోగాలిప్పిస్తామని ఆశ కల్పించింది. ఒక పేజీ స్కాన్ చేస్తే రూ.5 చెల్లిస్తామని చెప్పడంతో వందల మంది ఆసక్తి చూపారు. అయితే కంపెనీ నిర్వాహకులు అందుకోసం లక్ష రూపాయలు డిపాజిట్ చేయాలని చెప్పడంతో చాలా మంది ఆ మొత్తం చెల్లించారు. తొలుత వర్క్ కు సంబంధించిన మొత్తంతో పాటు డిపాజిట్ గా తీసుకున్న లక్ష రూపాయలు తిరిగి ఇచ్చేయడంతో చాలా మందికి నమ్మకం కుదిరింది. దీంతో రెండోసారి ఒక పేజీ స్కాన్ చేస్తే రూ.10 ఇస్తామని అందుకోసం రూ.3 నుంచి రూ.5లక్షలు డిపాజిట్ చేయాలని చెప్పడంతో దాదాపు 700 మంది రూ.30కోట్ల మేర చెల్లించారు. నిరుద్యోగుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన డిజినల్ ఇండియా నిర్వాహకులు రాత్రికి రాత్రే బిచాణా ఎత్తేశారు. ఫోన్ ఎత్తకపోవడం, ఆఫీసుకు తాళాలేసి ఉండటంతో మోసపోయామని గ్రహించిన బాధితులు సెంట్రల్ క్రైం స్టేషన్ పోలీసులను ఆశ్రయించారు. డిజినల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అమిత్ శర్మపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# ధరణి పోర్టల్‌ను రద్దు చేయాల్సిందే

(మొదటి పేజి తరువాయి) పాల్పడుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేస్తామని మరోమారు స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం దలితులకు, గిరిజనులకు ఇచ్చిన భూమిని టీఆర్ఎస్ లాక్కుంటుంది. హారితహారం పేరు మీద గిరిజనుల భూమిని లాక్కుంటున్నారు. నష్టపరిహారం అడిగిన భూ నిర్వాసితులను అరెస్ట్ చేసి జైల్లో పెడుతున్నారు. ఫ్యాక్టరీల పేరు మీద నయా భూస్వాములను కేసీఆర్ తయారుచేస్తున్నారు. ఐకియా కంపెనీకి 19 ఎకరాల భూమిని అతి తక్కువ ధరకు కట్టబెట్టారని మండిపడ్డారు. ఎకరా రూ. 50కోట్లు పలికే 15 ఎకరాల భూమిని ఎలాంటి టెండర్లు లేకుండానే ఐకియాకు కట్టబెట్టారని ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు జాగా లేదంటున్న కేటీఆర్.. ఐకియాకు ఇచ్చిన భూమిలో వాటిన నిర్మించొచ్చు కదా అని రేవంత్ సూచించారు. ఇప్పటికే కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు దోచుకుంది ధరణి పోర్టల్‌కు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం అని అన్నారు. మేం ప్రశ్నిస్తున్నందుకే..ధరణిపై కేసీఆర్ సమీక్షిస్తున్నారు. ధరణి పోర్టల్ భూ సమస్యలకు సంబంధించి లక్షకు పైగా ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయని రేవంత్ పేర్కొన్నారు. భూముల కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం దారుణాలు చేస్తోందని ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూ యజమానులను కేసీఆర్ సర్కార్ జైల్లో పెట్టిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ లో భూ సమస్యలు పెరిగిపోయాయని తెలిపారు. ధరణి వచ్చాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధరణిలో వారసత్వ భూములు గల్లంతయ్యాయని పేర్కొన్నారు. ఓటేసిన పాపానికి ప్రభుత్వమే తమ భూములను.. కొల్లగొడుతోందని బాధితులు రోదిస్తున్నా రని చెప్పారు. ఓఆర్ఆర్, ప్రాజెక్టులు, ఫార్మాసిటీలు, ట్రిపుల్ ఆర్ పేరుతో కొల్లగొడుతున్నారని దుయ్య బట్టారు. ధరణి లోపాల కారణంగా హత్యలు పెరుగుతున్నాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతులు కన్న బిడ్డల్లా చూసుకునే భూములను కేసీఆర్ సర్కారు అన్యాయంగా గుంజుకుంటోందని ఆరోపించారు. పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం వివిధ కారణాలు చెప్పి ప్రభుత్వం వెనక్కి తీసుకుంటోందని మండిపడ్డారు. తరతరాలుగా వస్తున్న భూముల్ని సర్కారే స్వయంగా లాక్కోవడం సిగ్గుచేటని రేవంత్ విమర్శించారు. ధరణి అద్భుత మని, సర్వరోగ నివారిణి అని కేసీఆర్ చెప్పిన మాటల్నీ అబద్దాలని ప్రస్తుత పరిస్థితిని చూస్తే అర్థమవుతోందని అన్నారు. ధరణి రికార్డుల్లో అసలు యజమాని పేరు కాకుండా ఎవరెవరి పేర్లు ఉంటున్నాయని, లేదంటే సర్కారు భూమి అని చూపిస్తోందని వాపోయారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలని కాంగ్రెస్ 25లక్షల ఎకరాల భూములు పంచితే.. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు 30 లక్షల ఎకరాలు మాయమయ్యాయని రేవంత్ ఆరోపించారు. ముఖ్యమంత్రి తీరుతో 5 లక్షల ఎకరాల పోడు భూములు కూడా ఆగమవుతున్నాయని అన్నారు. గౌరెల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా రైతులకు బేడీలు వేసిన ఘనత టీఆర్ఎస్ సర్కారుకే చెల్లిందని విమర్శించారు. పేదల భూములు గుంజుకునేందుకే కేసీఆర్‌ను ప్రజలు సీఎం కుర్చీలో కూర్చోబెట్టారా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఐటీ కంపెనీలు ఎవరికి ఉద్యోగాలు ఇస్తున్నాయో తెలియకపోయినా కేసీఆర్ సర్కారు మాత్రం అడ్డగోలుగా వాటికి భూములు కేటాయిస్తోందని రేవంత్ విమర్శించారు.



# తెలంగాణలో పెట్టుబడికి ఫ్రెంచ్ కంపెనీ ఆసక్తి

### స్వాగతించిన మంత్రి కెటిఆర్

**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తీవ్ర ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వచ్చింది. ఫ్రెంచ్ కంపెనీ సాఫ్రాన్ గ్రూప్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. దీంతో ఫ్రెంచ్ కంపెనీ సాఫ్రాన్ గ్రూప్ నిర్ణయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ స్వాగతించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మెగా ఏరో ఇంజిన్ ఎంఆర్ఓ ఏర్పాటుకు సాఫ్రాన్ నిర్ణయించిందన్నారు. హైదరాబాద్‌లో సాఫ్రాన్ ఏర్పాటు చేసే ఎంఆర్ఓ ప్రపంచంలోనే పెద్దది అని తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థ భారత్‌లో ఏర్పాటు చేసే మొదటి ఇంజిన్ ఎంఆర్ఓ అని పేర్కొన్నారు. ఎంఆర్ఓ, ఇంజిన్ టెస్ట్ సెల్ పెట్టుబడి దాదాపు రూ. 1,200 కోట్లు అని తెలిపారు. 800 నుంచి 1000 మంది వరకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఏరోస్పేస్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ మారబోతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## రుణమాఫీ అమలులో
# ప్రభుత్వం విఫలం

### విద్యా వాలంటరీలను కొనసాగించాలి

### జడ్పీమీటింగ్‌కు టీఆర్ఎస్ డుమ్మాపై జీవన్ రెడ్డి ఆగ్రహం

**మంచిర్యాల, జూలై 6 (సమ సమాజం):** రైతు రుణమాఫీ పథకం అమలు చేయకపోవడంతో బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వడం లేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. రుణమాఫీ ఎప్పుడు చేస్తారో కూడా తెలియడంలేదన్నారు. ఇంతకాలం ఓపిక పట్టిన రైతులు అమలువుతుందన్న ధీమాలో ఉన్నారని అన్నారు. వరిధాన్యం కొనుగోలు చేసి చాలా రోజులు అవుతున్నా రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్ల నియామకాలు పూర్తయ్యే వరకు విద్యా వాలంటరీలను కొనసాగిం చాలని ఆయన డిమాండ్ చేశారు. మంచిర్యాల జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి జరిగిన జడ్పీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతోపాటు చాలా మంది టీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు జడ్పీ సమావేశానికి హాజరుకాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జడ్పీ చైర్ పర్సన్ దళిత మహిళ కావడంతో ఈ విధంగా చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దళిత ప్రజాప్రతినిధి పట్ల రాజకీయ వికృత క్రీడ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూముల సమస్య అలాగే ఉంది.. విత్తనాలు రాయితీపై సరఫరా చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. రైతులకు ఏదో చేస్తామనిచెప్పి వంచించడం తప్పచేసిందేమీ లేదన్నారు.

# గిరిజన గురుకులాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య

### నూతన గురుకులాల ఏర్పాటుపై మంత్రి సత్యవతి సమీక్ష



**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారని గిరిజన, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. గిరిజన గురుకులాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ సంవత్సరం ఏర్పాటు చేయనున్న నూతన గురుకులాలు, స్టడీ సెంటర్ల ఏర్పాటుపై హైదరాబాద్ లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్ లో అధికారులతో మంత్రి సత్యవతి రాథోడ్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగుల భర్తీ చేపడుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో మరికొన్ని స్టడీ సర్కిల్స్ ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని మంత్రి సత్యవతి అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన భోజనం వడ్డించాలని కోరారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలని ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు, దుప్పట్లు, గ్లాసులు, ట్రంకు పెట్టెలతో పాటు ఇతర సౌకర్యాలన్నీ అందేలా చూడాలని ఆదేశించారు. 10వ తరగతి వరకూ విద్యను అందిస్తున్న గురుకుల పాఠశాలల్లో ఇంటర్మీడియట్ వరకూ విద్యను అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు, ప్రైవేట్ రంగాల్లో కావాల్సిన నైపుణ్యాల కోసం స్టడీ సెంటర్లలో శిక్షణ అందించేలా ప్రణాళికను రూపొందించాలని మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులకు సూచించారు. ప్రతి స్టడీ సర్కిల్ లో ఫ్యాకల్టీ ఏర్పాటుతోపాటు, కంప్యూటర్లు, అత్యధిక సాంకేతిక మౌలిక వస్తువులను సమకూర్చాలని ఆదేశించారు. రాజేంద్రనగర్ లోని ఐఐటీ జేఈఈ ఎంసెట్ కోచింగ్ తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మం, పరిగి, హయత్ నగర్, వరంగల్ లో ఈ ఏడాది కోచింగ్ సెంటర్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం సీఎం కేసీఆర్ తీవ్రంగా కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే ఈ నిర్ణయాలని మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు.

# 317 జీవోపై రాజకీయ పార్టీల అనవసర రచ్చ

### బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు: హరీష్



**సిద్ధిపేట, జూలై 6 (సమ సమాజం):** ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ 317 జీవో తెస్తే.. దాన్ని కొన్ని రాజకీయ పార్టీలు జీర్ణించుకోక బాధ్యత లేకుండా వ్యవహరించారని మంత్రి హరీష్ రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు 317 జీవో వద్దు అంటూ రాజకీయం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో 16 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 95వేల ఉద్యోగాలు త్వరలోనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్మీలో ఉద్యోగాలు భర్తీ చేయండి అంటే.. అగ్ని పథ్ స్కీం తెచ్చి యువతను మోసం చేయడమే కాదు.. యువతను నిర్వీర్యం చేసి వారి జీవితాలను నాశనం చేస్తున్నారని మంత్రి హరీష్ రావు ఆరోపించారు. కేంద్రం ప్రభుత్వ సంస్థలు కూడా అమ్మేస్తున్నారని, దేశంలో ఉపాధి అవకాశాలు కూడా లేవన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక దేశం ఎంతో దుర్భరమైన దుస్థితికి దిగజారిపోయిందన్నారు. ఫేక్ వార్తలు, ఫేక్ న్యూస్ చెప్పడంలో బీజేపీ, బీజేపీ సోషల్ మీడియాకు డాక్టర్ రేట్ ఇవ్వాలని.. అందుకే బీజేపీ సోషల్ మీడియాను, వాటిలో వచ్చే వార్తలు తిప్పికొట్టాలని కోరారు. సరైన కోచింగ్ దొరక్క గతంలో చాలా ఇబ్బందులు పడ్డారని.. అలాంటి సమస్యలు రాకుండా త్వరలోనే లాంగ్ టర్మ్ డీఎస్సీ కోచింగ్ ప్రారంభిస్తామని హరీష్ రావు వెల్లడించారు. సిద్ధిపేట మండలం పొన్నాల టీర్ఎస్ పార్టీ కార్యాలయంలో టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు, విద్యార్థులతో ముఖాముఖిలో మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 34 శాతం ఉత్తీర్ణత వస్తే, కేసీఆర్ కోచింగ్ సెంటర్ నుండి 82 శాతం ఉత్తీర్ణత రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సిద్ధిపేట జిల్లాలోనే 550 గ్రూప్ 4ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయని.. వాటికోసం కూడా ఉచిత కోచింగ్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత కోచింగ్ ఇస్తున్నామని ఆయన గుర్తు చేశారు.

# నిజామాబాద్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు

### ఎంఐఎం మద్దతుతోనే సాగుతున్నాయి

### కమిషనర్ నాగరాజును బదిలీ చేయాలి: ఎంపి అర్వింద్



**నిజామాబాద్, జూలై 6 (సమ సమాజం):** నిజామాబాద్ జిల్లాలో ఉగ్రవాద మూకలు తమ స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నాయని.. మత కలహాలు సృష్టించేందుకు ఎంఐఎంతో కలిసి ఉగ్రవాద సంస్థలు పని చేస్తున్నాయని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కనుసన్నల్లోనే ఉగ్రవాద చర్యలు పని చేస్తున్నాయని.. పోలీస్ కమిషనర్ నాగరాజుని నిజామాబాద్ నుండి బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీజేపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టేందుకే సీపీగా నాగరాజుని పంపించారని చెప్పారు. కేటీఆర్ కుల అహంకారిగా మాట్లాడుతున్నాడరని.. మొన్నటి మోడీ సభ లాంటి పెద్ద సభను నేను నా జీవితంలో చూడలేదని ఎంపీ అర్వింద్ తెలిపారు. ఫసల్ భీమా యోజన పథకం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు . గత సంవత్సరం అధిక వర్షాలతో పసుపు పంట దెబ్బతీన్నదని..కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు విషయంలో కేసీఆర్ సర్కార్ కావాలనే జాప్యం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల భీమా ప్రీమియం చెల్లించక 46 వేలమంది రైతులకు అన్యాయం చేస్తుందని చెప్పారు. జిల్లాలో మంత్రిగా ప్రశాంత్ రెడ్డి చేసిందేమీ లేదని.. బాల్కొండ నియోజక వర్గంలో నిర్మిస్తున్న చెక్ డ్యాంలు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టినవే అన్నారు. చెక్ డ్యాంల నిధులు రాష్ట్రం ఇస్తుందని మంత్రి ప్రశాంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న అర్వింద్.. ఆజాధికా అమృత్ మహోత్సవ్ లో జిల్లాలో 75 చెరువులు, కుంటల మరమ్మతులకు ఒక్కో పాండ్ కి 7 లక్షలు కేంద్రం ఇచ్చిందన్నారు.కేంద్రం ఇచ్చే సర్వ శిక్ష అభియాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్ళిస్తుందని.. కేంద్రం నుంచి వచ్చే లక్షల కోట్లు జిల్లాలకు చేరటం లేదన్నారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధిని టీఆరెస్ ఎమ్మెల్యేలు నాశనం చేస్తున్నారని.. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ విచ్చల విడిగా సప్లై అవుతున్నాయని చెప్పారు.

# జల్‌పల్లిని మరింత అభివృద్ధి చేస్తా: సబిత



**రంగారెడ్డి, జూలై 6 (సమ సమాజం):** జల్‌పల్లి మున్సిపాలిటీలో రూ. 20 కోట్లతో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, జల్‌పల్లిని మరింత అభివృద్ధి చేస్తామని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో బుధవారం మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాప చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే టీఆర్ఎస్ ప్రభుత్వ నినాదాలు, విధానాలని పేర్కొన్నారు. డివిజన్లలో సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో 10 బస్తీ దవాఖానాలు మంజూరు కాగా జల్‌పల్లిలోనే నాలుగు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ సాధి, వైస్ చైర్మన్ ఫర్హా నాజ్, నాయకులు ఖలీఫా, కృష్ణా రెడ్డి, యూసుఫ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌తో ఉదయ్‌పూర్ లింకులు

### నగరంలో దాడులు చేపట్టిన ఎన్ఐఏ

**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** ఉదయ్‌పూర్ టైలర్ కన్హయ్య హత్య కేసులో ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం చేసింది. హత్య కేసులో నిందితులుగా ఉన్న వ్యక్తులు హైదరాబాద్‌లో షెల్టర్ తీసుకున్నారనే సమాచారంతో ఎన్ఐఏ మంగళవారం సోదాలు చేసింది. సంతోష్‌నగర్‌లో తావీద్ సెంటర్ నిర్వహిస్తున్న.. బిహార్‌కు చెందిన మహ్మద్ మున్వార్ హుస్సేన్ అశ్రఫి అనే వ్యక్తి అదుపులోకి తీసుకొని ఎన్ఐఏ విచారించింది. ఈ నెల 14న జైపూర్‌లోని ఎన్ఐఏ ఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు ఇచ్చింది.

# ఖాళీ ప్రాంతాలన్నీ పచ్చగా మెరవాలి

- 8వ విడత హరితహారంలో చురకుగా మొక్కలు నాటాలి
- ఈయేడాది 19.54 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం
- అధికారులతో సమీక్షలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి


**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** రాష్ట్రంలోఉన్నఅన్ని ఖాళీ ప్రాంతాలు హరితమయం అయ్యేలా ఎనిమిదవ విడత హరితహారంలో భాగంగా మొక్కలు నాటాలని అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత శాఖలను కోరారు. గత ఏడు విడతల హరితహారం కార్యక్రమాల అనుభవాలను పరిగణలోకి తీసుకుని ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఈయేడాది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఎనిమిదవ విడత తెలంగాణకు హరితహారం పురోగతిపై రాష్ట్రస్థాయి పరిశీలన- సమన్వయ కమిటీ సమావేశం బుధవారం అరణ్య భవన్ లో జరిగింది. అటవీ, మున్సిపల్, సాగునీటి, పంచాయితీ రాజ్ శాఖలతో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాఖల వారీగా పెట్టిన మొక్కలు నాటే లక్ష్యాలు, నర్సరీల్లో లభ్యత, అవసరమైన సామాగ్రి, పురోగతిపై సమీక్షా సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ఈయేడాది 19.54 కోట్ల మొక్కలు రాష్ట్ర వ్యాప్తంగా నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పంచాయితీ రాజ్ 8.76 కోట్లు, మున్సిపల్ శాఖ- 7.32 కోట్లు సాగునీటి శాఖ-5 కోట్లు, అటవీ శాఖ- 1.54 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ధేశిరచారు.హరితహారం కార్యక్రమాన్ని ఎట్టిపరిస్థితుల్లో రొటీన్ కార్యక్రమంగా తీసుకోవద్దని, ఈ కార్యక్రమం వల్ల పర్యావరణ హితంతో పాటు, ప్రభుత్వానికి, పాల్గొన్న శాఖలకు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు వస్తున్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ సూచించారు. రుతుపవనాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన నేపథ్యంలో మంచి వర్షాలు కురుస్తున్నాయని, మొక్కలు నాటడాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. వీలైనంత వరకు పెద్ద మొక్కలు నాటడం ద్వారా బతికే శాతాన్ని వందశాతం పొందవచ్చని స్పష్టం చేశారు. ప్రాంతాలను, నేలతత్వాన్ని బట్టి మొక్కలు నాటాలని, వీలైనంత వరకు నేటివ్ స్పీసీస్ కు(ప్రాంతీయ మొక్కలకు) ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కోనో కార్పస్ రకం మొక్కలు నాటడంపై భిన్నాభిప్రాయలు ఉన్నందున వాటిని హరితహారంలో భాగంగా నాటడాన్ని నిలిపివేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో మొక్కలు నాటే కార్యాచరణపై సమీక్షించారు.ఇరిగేషన్ శాఖ పరిధిలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల వెంట పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ఈసారి ప్రత్యేక ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు వెల్లడించాడు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ ఎం డోబ్రియాల్, మున్సిపల్ శాఖ కమిషనర్ డాక్టర్ సత్యనారాయణ, అదనపు పీసీసీఎఫ్ ఏ.కే.సిన్హా, హెచ్ఎండీఏ డైరెక్టర్ (అర్బన్ ఫారెస్ట్రీ) డాక్టర్ ప్రభాకర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ ఘన నివాళి



**ఇబ్రహీంపట్నం జూలై 6 (సమ సమాజం):** యాచారం మండల కేంద్రంలో ఎమ్ఆర్పీఎస్ ఇంచార్జి కొమ్ము మహేష్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 36 వ వర్ధంతి సందర్భంగా యాచారం మండలంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, జగ్జీవన్ రామ్ స్వాతంత్ర సమరయోధుడఅనీ, అట్టడుగు వర్గాల నుంచి వచ్చి ఎంతో ఉన్నతమైన స్థానంలో ఆయన నిలవడం ఆయన దేశానికి చేసిన సేవలు మరపురానివని అన్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ స్టేట్ ఉపాధ్యక్షులు కాళ్ళ జంగయ్య మాదిగ, యాచారం గ్రామ శాఖ అధ్యక్షులు మూలి మహేష్ మాదిగ, నందిని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కందికంటి ఆనంద్,, సీనియర్ నాయకులు చింతల సాయిలు, బోడ కృష్ణ, బోడ అ బ్బయ్య, బోడ ముత్యాలు, జోగు అంజయ్య, మస్కు యాదయ్య, ముచ్చర్ల క్రిస్టఫర్, ఆనంద్, పాండు, విహెచ్పిఎస్ జిల్లా నాయకులు యాచారం జంగయ్య, వరికుప్పల వెంకటేష్ , మల్లేష్, మండల అధ్యక్షులు మహమ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

# ఆదమరిచిన అధికారులు గుంతల రోడ్డులో ప్రయాణం ఎలా



**ఇబ్రహీంపట్నం జూలై 6 (సమ సమాజం):** ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ ముందు, వెనకాల కాలనీ చివరి వరకు గుంతల రోడ్లలో, వర్షంతో నిండిన నీటిలో నుండి కనీసం నడవలేని పరిస్థితి రోడ్లు ఉన్నాయని కాలనీ వాసులు ఎంత మొరపెట్టుకున్న కనీసం తమ సమస్యని పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ సందర్భంగా కాలనీవాసి మాట్లాడుతూ, రోజు ఉదయం నడుచుకుంటూ వెళ్లే దారి అధికారులకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని రోడ్డు సమస్యను తీర్చాలని కోరారు. ఓవైపు ఇబ్రహీంపట్నం మున్సిపల్ అభివృద్ధి పథంలో నడుస్తుందని గొప్పలు చెప్పుకునే నాయకులు ఒక్కసారి మా కాలనీకి వచ్చి రోడ్ల దుస్థితి చూడాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో బాగా పెరిగిపోతున్న భూ సమస్యలు

### ధరణితో దరిద్రం వచ్చినట్లయ్యింది
### దున్నేవాడికి భూమి ఇచ్చిన ఘనత ఇందిరాగాంధీదే
### దున్నేవాడికి భూమి లేకుండా టిఆర్ఎస్ కుట్రలు
### ఔటర్ చుట్టూ మాయం అవుతున్న భూములు
### ధరణి సమస్యలపై ధర్నాలో కాంగ్రెస్ నేతల మండిపాటు



**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** రాష్ట్రంలో భూ సమస్యలు బాగా పెరిగిపోతున్నాయని కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధరణి రచ్చబండ కార్యక్రమంలో నేతలు పాల్గొని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ధరణి వచ్చి దరిద్రం వచ్చినట్లైందని దుయ్యబట్టారు. దున్నేవాడికి భూమి ఇచ్చిన ఘనత ఇందిరాగాంధీదేనని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ అన్నారు. ధరణి పోర్టల్ ఎందుకు తీసుకొచ్చారో సీఎం కేసీఆర్‌కైనా తెలుసా అని ప్రశ్నించారు. దొరలకు లాభం చేసేందుకే ధరణి ఆరోపించారు. నగరం చుట్టూ ఓఆర్ఆర్ వచ్చాకా భూముల రేట్లు విపరీతంగా పెరిగాయని వీహెచ్ అన్నారు. ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న పేదల భూములను పెద్దలకు రాసిచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే లోపు ఉన్న భూములు మాయం చేస్తారని వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లుండి హెచ్ఎండీఏ ముందు నిరసన చేపడతామని హెచ్చరించారు. రిళిట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. పేదల భూములను దొరలు ఆక్రమిస్తున్నారు. ఓఆర్ఆర్ చుట్టూ భూములన్నీ కబ్జా చేస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చేసరికి అన్ని భూములు కాజేస్తారు. ఇప్పటి నుంచే మనమంతా కలసికట్టుగా దీనిపై పోరాటం చేయాలని వీహెచ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో భూ సమస్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎస్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెవెన్యూ రికార్డులను సవరించాలని డిమాండ్ చేశారు. భూసమస్యలతో రైతులు చనిపోతున్నారని.. హత్యలు కూడా జరుగుతున్నాయని కోదండరెడ్డి తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ ఎమ్మార్వో చనిపోవడానికి భూ సమస్యలే కారణమన్నారు. అసైన్డ్ భూములను అడ్డగోలుగా గుంజుకుంటున్నారన్న ఆయన... వాటిని వెంచర్లుగా వేసుకుని అధికార పార్టీ నేతలు కోట్లు సంపాదిస్తున్నారని కోదండ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వంపై రైతులు పోరాడితే మేము అండగా ఉంటామని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క స్పష్టం చేశారు. ఎక్కడ భూములున్నా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పోడు రైతులపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ భూములు పంచితే.. తెరాస లాక్కుంటోందని సీతక్క ధ్వజమెత్తారు. భూముల విలువ పెంపు పేరుతో దందా చేస్తున్న సీఎం కేసీఆర్.. దున్నేవాడికి భూమి లేకుండా చేస్తున్నాడని ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. ఫార్మా సిటీ పేరుతో అడ్డగోలుగా భూములను దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడ ఖాళీ భూములు కనిపించినా వాటిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫారెస్ట్ అధికారులు సైతం భూములు లాక్కుంటూ.. పోడు రైతులపై దాడులు చేస్తున్నారని సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి కారణంగా మహబూబాబాద్ జిల్లా నారాయణపూర్‌లో 1800 ఎకరాలు ఆగమయ్యాయని సీతక్క ఆరోపించారు. భూమి అంటే తరతరాలుగా వచ్చే ఆధారమని, కేసీఆర్ ప్రభుత్వం దాన్ని దూరం చేస్తోందని వాపోయారు. కాంగ్రెస్ భూములు పంచితే.. టీఆర్ఎస్ గుంజుకుని ప్రైవేటు కంపెనీలకు పంచుతోందని సీతక్క విమర్శించారు. నిన్న మొన్నటి వరకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు ఇప్పుడు టీఆర్ఎస్ నేతల పేర్లకు మారుతున్నాయని మండిపడ్డారు.

# మోడీ లాంటి నాయకుడు గతంలో లేనే లేడు

### బిజెపి లేదనుకుంటే పొరపాటే: జివిఎల్

**హైదరాబాద్, జూలై 6 (సమ సమాజం):** రాష్ట్రంలో మోదీ సభ జరిగిన తీరు గతంలో లేదని బీజేపీ ఎంపీ జీవీఎల్ అన్నారు. మోదీ లాంటి నాయకుడిని దశాబ్దాలుగా ఎవరూ చూడలేదని చెప్పారు. మోదీ ఏపీకి రావాలని అడిగానని.. ఆయన ఏపీకి పలు మార్లు వస్తాను అని హామీ ఇచ్చారని తెలిపారు. త్వరలోనే మోదీ రాష్ట్రానికి మరోసారి రాబోతున్నారని చెప్పారు. బీజేపీ ఫోకస్ తెలుగు రాష్ట్రాలపైన విస్తృతంగా ఉందన్నారు. ఏపీలో ప్రత్యామ్నాయం దిశగా బీజేపీనే ఉండబోయే విధంగా ఎదుగుతామని వ్యాఖ్యానించారు. బీజేపీ బలోపేతం లో భాగంగా క్యాంపు కార్యాలయంలోనే అందుబాటులో ఉంటానన్నారు. విశాఖలోనూ త్వరలోనే క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తామన్నారు. జేపీ నడ్డా రెండు రోజుల పర్యటన, అమిత్ షా తిరుపతి రాక, మోదీ సభ ఏపీ లో బలోపేతం దిశగానే అడుగులు పడుతున్నాయన్నారు. బీజేపీ తమకు పోటీ కాదు అనుకుంటే ఆ పార్టీల పొరపాటేనన్నారు. జూలై 10వ తేదీన పదాధికారుల సమావేశంలో జాతీయ కార్యవర్గ సమావేశాల్లో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.




# చలన చిత్రం

## మళ్లీ ఎంట్రీ ఇస్తోన్న కలర్స్ స్వాతి



చాలాకాలం తర్వాత హీరోయిన్ 'కలర్స్' స్వాతి సిల్వర్ స్క్రీన్‌పై సందడి చేయబోతుంది. కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన డేంజర్ సినిమాలో కీలక పాత్ర పోషించిన స్వాతి ఆ తర్వాత వెంకటేశ్ , త్రిష జంటగా నటించిన 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' సినిమాలో మంచి పాత్రను చేసి గుర్తిపు తెచ్చుకుంది. ఆ తర్వాత హీరోయిన్‌గా మారి 'స్వామి రారా', 'కార్తికేయ', 'త్రిపుర' అలాగే, మలయాళంలో 'మోసాయిలే', 'కుదిర మీనుగళ్', 'నార్త్ 24 కాతమ్', 'త్రిషూర్ పూరమ్', 'ఆమెన్' లాంటి సౌత్ సూపర్ హిట్ సినిమాలలో నటించి క్రేజ్ తెచ్చుకుంది. అయితే, కెరీర్ మంచి పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకొని ఇండస్ట్రీకి దూరంగా ఉంది. ఆ మధ్య మళ్ళీ కార్తికేయ సీక్వెల్ సినిమాతో మళ్ళీ స్వాతి ఎంట్రీ ఇస్తుందని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. కానీ అవన్నీ కేవలం గాసిప్స్ మాత్రమే.స్వాతి మళ్ళీ సిల్వర్ స్క్రీన్ మీద కనిపించబోతున్న లేటెస్ట్ మూవీ 'మంత్ ఆఫ్ మధు'. ఈ మూవీలో నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్నాడు. శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహిస్తున్నారు. 'భానుమతి అండ్ రామకృష్ణ' సినిమాని నిర్మించిన క్రిషివ్ ప్రొడక్షన్స్ హ్యాండ్ పిక్డ్ స్టోరీస్ మేకర్స్ పతాకంపై యశ్వంత్ ములుకుట్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ఫస్ట్ లుక్ టైటిల్ పోస్టర్ ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

## తన తదుపరి టార్గెట్ వారిద్దరే అంటోన్న కృతిశెట్టి

### రామ్‌చరణ, మహేశ్ బాబుల సరసన నటిస్తా



టాలీవుడ్ స్టార్ హీరోలైన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, సూపర్ స్టార్ మహేశ్ బాబు లతో నటించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు యంగ్ బ్యూటీ కృతి శెట్టి తెలిపింది. 'ఉప్పెన' సినిమాతో వచ్చిన క్రేజ్‌తో ఇప్పుడు బిజీగా సినిమాలు చేసే రేంజ్‌ను తెచ్చిపెట్టింది. ఈ సినిమా తర్వాత అరడజను సినిమాలను కమిటైంది. అంతేకాదు, బ్యాక్ టు బ్యాక్ మూడు హిట్స్ అందుకోవడంతో టాలీవుడ్‌లో మాత్రమే కాకుండా కోలీవుడ్‌లోనూ క్రేజీ ఆఫర్స్ అందుకుంటుంది. త్వరలో ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని సరసన నటించిన ద్విభాషా చిత్రం 'ది వారియర్'రిలీజ్‌కి రెడీ అవుతోంది. దాంతో కృతి శెట్టి వరుసగా పలు ఛానల్స్‌కు ఇంటర్వ్యూలు ఇస్తూ సందడి చేస్తుంది. ఈ సందర్భంగానే తనకు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, సూపర్ స్టార్ మహేశ్ బాబులపై ఉన్న అభిమానాన్ని వెల్లడించింది. చరణ్ సూపర్ క్యూట్‌గా ఉంటారని చెప్పిన కృతి, మహేశ్ చాలా హ్యాండ్సం గా ఉంటారు.. అని తెలిపింది. అంతేకాదు, వీరి సరసన నటించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్టుగా తన మనసులోని మాటను బయటపెట్టింది. కృతి పర్ఫారెన్స్ పరంగా ఇప్పటికే అందరి ప్రశంసలు అందుకుంది. గ్లామర్ రోల్స్ చేయడానికి, అందంలోనూ ..ఏ రకంగా చూసుకున్న తాను చెప్పిన చరణ్, మహేష్‌ల సరసన నటించే అన్నీ క్వాలిటీస్ ఉన్నాయి. కాబట్టి అమ్మడి ఆశలు త్వరలోనే నెరవేడం ఖాయమని చెప్పుకుంటున్నారు.

## టర్కీ షూటింగ్‌కు రెడీ అవుతున్న బాలయ్య




నందమూరి బాలకృష్ణ హీరోగా ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం షూటింగ్ ముగింపు దశకు వచ్చినట్లుగా సమాచారం.ఇప్పటికే విడుదల అయిన ఫస్ట్ లుక్ మరియు టీజర్ కు అద్భుతమైన రెస్పాన్స్ రావడం తో ఖచ్చితంగా బాలయ్య కు ఇది మరో అఖండ విజయాన్ని తెచ్చి పెడుతుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. బాలయ్య అఖండ సినిమా తర్వాత వస్తున్న సినిమా అవ్వడం వల్ల అంచనాలు భారీగా ఉన్నాయి. పైగా ఈ సినిమాలో లుక్ బాలయ్య అభిమానులకు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరిని కూడా మెప్పించే విధంగా ఉంది. ఈ సినిమా విడుదల తేదీ కోసం అభిమానులు మరియు ఇండస్ట్రీ వర్గాల వారు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన విదేశీ షెడ్యూల్ పూర్తి అయితే విడుదల తేదీని ప్రకటించాలని మేకర్స్ వెయిట్ చేస్తున్నారట. బాలయ్య 107 సినిమా కోసం అమెరికా వెళ్లేందుకు మొదట ప్లాన్ చేశారు. కాని గత కొన్ని రోజులుగా వీసా ఇష్యూ అవుతోంది. కొందరు యూనిట్ సభ్యులకు వీసా సమస్య రావడంతో పాటు ఇతర కారణాల వల్ల మొత్తానికి అమెరికా షెడ్యూల్ ను క్యాన్సిల్ చేశారనే వార్తలు వస్తున్నాయి. అమెరికాలో షూట్ చేయాలనుకున్న షెడ్యూల్ ను టర్కీ లో చేయబోతున్నారు. అతి త్వరలోనే టర్కీకి వెళ్లి షూట్ చేసుకు రాబోతున్నారు. బాలయ్య ఇటీవలే కరోనా నుండి తేరుకున్నారు. ఆయనతో హైదరాబాద్ లో కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. టర్కీ షెడ్యూల్ కోసం బాలయ్య కూడా సిద్ధం అవుతున్నాడు. యూనిట్ సభ్యులు అంతా కూడా టర్కీ ట్రిప్ కు సంబంధించిన ఏర్పాట్లలో మునిగి ఉన్నారట. సినిమాను ఇదే ఏడాది దసరా లేదా దీపావళి ఆ రెండు కాదంటే అఖండ విడుదల అయినట్లుగా ఈ ఏడాది చివరి నెలలో విడుదల అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా తర్వాత ఎఫ్ 3 దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలయ్య 108వ సినిమా రూపొందబోతున్న విషయం తెల్సిందే.


## ధనుష్‌కు విలన్‌గా డైలాగ్ కింగ్ సాయికుమార్



తమిళ స్టార్ హీరో ధనుష్ తొలి తెలుగు ఎంట్రీ మూవీ 'సార్' లో నటిస్తున్న సంగతి తెలిసిందే. సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్నాడు. తెలుగు, తమిళ ద్విభాషా చిత్రంగా రూపొందుతోంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎడ్యుకేషన్ మాఫియాపై.. జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్న ఒక యువకుడు సాగించిన పోరాటమే ఈ సినిమా కథాంశం. ముఖ్యంగా విద్యా వ్యవస్థ ప్రైవేటీకరణపై అతడు తిరుగుబాటు చేస్తాడు. ఇంచుమించు ఇలాంటి కథాంశంతోనే ఇది వరకు 'రఘువరన్ బీటెక్' చిత్రంలో నటించాడు ధనుష్. కాకపోతే అందులో అతడు బీటెక్ గ్రాడ్యుయేట్. 'సార్' చిత్రంలో అతడొక లెక్చరర్. ఇక 'సార్' చిత్రం గురించి ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే.. ఇందులో విలన్‌గా సాయికుమార్ నటిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. అయితే ఆ పాత్ర గురించి ఇతర సమాచారం తెలుపలేదు. డైలాగ్ కింగ్‌గా దక్షిణాదిన పేరొందిన సాయికుమార్‌కు విలన్ పాత్రలు కొట్టిన పిండి. ఇదివరకు చాలా సినిమాల్లో ఆయన విలన్‌గా నటించి మెప్పించారు. గంభీరమైన వాయిస్‌తో ఆయన పలికే డైలాగ్స్ ఆయా చిత్రాలకే హైలైట్స్‌గా నిలిచాయి. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో ఇంకా తనికెళ్ళ భరణి, నర్రా శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా.. దినేశ్ కృష్ణన్ ఛాయాగ్రహణం నిర్వహిస్తున్నారు. ఈ సినిమా గానీ సూపర్ హిట్ అయితే.. దర్శకుడిగా వెంకీకి ఇక తిరుగుండదు.

## రెండు పండగలు..రెండు సినిమాలు


### చిరంజీవి సినిమాలపై అభిమానుల ఆసక్తి



టాలీవుడ్‌లో సంక్రాంతి, దసరా సీజన్స్‌లో విడుదలయ్యే సినిమాలకి విపరీతమైన క్రేజ్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోఈ పండుగలకి సెలవులు ఉంటాయి గనుక ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సీజన్స్‌లో ఎక్కువగా సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపిస్తారు. అలాగే మాస్ ఆడియన్స్ కూడా భారీగా థియేటర్స్‌కు క్యూ కడతారు. యావరేజ్ టాక్ తెచ్చుకున్నా ఈ సీజన్ లో బ్లాక్ బస్టర్ కైవసం చేసుకోవచ్చు. అందుకే ఈ పండగల సందర్భంగా చిత్రాల విడుదలకు అంతా పోటీ పడుతుంటారు. మెగాస్టార్ చిరంజీవి ఈసారి రెండు పండుగలపైనా దృష్టి పెట్టి చిత్రాలను పూర్తి చేస్తున్నారు. ఆయన నటిస్తున్న 'వాల్తేరు వీరయ్య' చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేస్తున్నట్టు ఇటీవల మేకర్స్ అఫీషియల్ గా ప్రకటించారు. బాబీ దర్శకత్వంలో మైత్రీమూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిరు 154వ చిత్రంగా విశేషాన్ని సంతరించుకుంది. శ్రుతి హాసన్ కథానాయికగా నటిస్తుండగా.. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో మాస్ మహారాజా రవితేజ కీలక పాత్ర పోషిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ముఠామేస్త్రిని పోలిన మాస్ పాత్రను చిరు మళ్ళీ ఇందులో చేస్తుండడం విశేషం. వాల్తేరు సముద్రతీరం నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది.ఇక 'వాల్తేరు వీరయ్య' సినిమా అనౌన్స్‌మెంట్ వచ్చిన కొద్దిరోజులకే చిరంజీవి 153వ చిత్రం 'గాడ్‌ఫాదర్' చిత్రం విడుదల కూడా ప్రకటించి షాకిచ్చారు మేకర్స్. ఈ సినిమాను ఈ దసరా కానుకగా విడుదల చేయబోతున్నట్టు తెలిపారు. తమిళ దర్శకుడు మోహన్ రాజా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా మలయాళ సూపర్ హిట్ 'లూసిఫర్' చిత్రానికి అఫీషియల్ రీమేక్ అన్న సంగతి తెలిసిందే. నయనతార , సత్యదేవ్ ముఖ్యపాత్రలు పోషిస్తుండగా.. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ప్రత్యేకమైన పాత్ర చేస్తున్నారు. విలన్ గా జగపతిబాబు నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. ఇంకా సునీల్ చిరంజీవికి అనుచరుడిగా నటిస్తున్నారు. ఇలా ఒకేసారి రెండు పండుగలకు మెగాస్టార్ రిలీజ్ లాక్ చేసుకొని అభిమానుల్ని ఖుషీ చేశారు.

## బాహుబలి లెవల్లో చోళుల చరిత్రపై చిత్రం

### రాణి నందినిగా నటిస్తున్న ఐశ్వరాయ పోస్టర్ విడుదల




'బాహుబలి' తరవాత సినిమా ఇండస్ట్రీలో అలాంటి సినిమా కోసం నిర్మాతలు, దర్శకులు ఇప్పుడు ఆలోచిస్తున్నారు. దీంతో దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోనూ లార్జర్ దెన్ లైఫ్ సినిమాల నిర్మాణం ఊపందుకుంది. ఇప్పటికే పలు సినిమాలు నిర్మాణ దశలో వున్నాయి. ఇందులో దిగ్రేట్ డైరెక్టర్ మణిరత్నం డ్రీమ్ ప్రాజెక్ట్ ఒకటి. గత కొంత కాలంగా కల్కి కృష్ణమూర్తి రాసిన ఫేమస్ నవల 'పొన్నియన్ సెల్వన్' ఆధారంగా అదే పేరుతో భారీ మూవీని తెరపైకి తీసుకురావాలని మణిరత్నం విశ్వప్రయత్నాలు చేశారు. లైకా ప్రొడక్షన్స్ ముందుకు రావడంతో వారితో కలిసి మద్రాస్ టాకీస్ బ్యానర్ పై చోళ ఎంపైర్ నేపథ్యంలో ఈ మూవీని రెండు భాగాలుగా తెరపైకి తీసుకొస్తున్నారు. దాదాపు 500 కోట్ల భారీ బడ్జెట్ తో ఈ మూవీని తెరకెక్కిస్తున్నట్టుగా తెలుస్తోంది. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ మూవీలోని ఫస్ట్ పార్ట్ ని సెప్టెంబర్ 30న పాన్ ఇండియా వైడ్ గా ఐదు భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. చియాన్ విక్రమ్‌తో పాటు కీలక తారాగణం మొత్తం ఈ చిత్రంలో నటిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రిలీజ్ కు రెడీ అవుతున్న ఈ మూవీ రిలీజ్ మరో రెండు నెలలు వుండటంతో చిత్ర బృందం ప్రమోషన్స్ ని స్టార్ట్ చేసింది. తాజాగా విక్రమ్ లుక్ కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ని విడుదల చేసింది. ఇందులో విక్రమ్ ఛోళరాజు ఆదిత్య కరికాళన్ గా నటిస్తున్నాడు. ఆ తరువాత కార్తి లుక్ ని కూడా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో కార్తి వల్లవరాయన్ వందియదేవన్ గా కనిపించబోతున్నారు. ఈ ఇద్దరి లుక్స్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా బుధవారం ఐశ్వర్యారాయ్ లుక్ ని విడుదల చేశారు. ఈ చిత్రంలో ఐశ్వర్యారాయ్ ద్విపాత్రాభినయం చేస్తోంది. అందులో ఓ పాత్రలో పళువూర్ క్వీన్ నందినిగానూ కనిపించబోతోంది. బుధవారం మేకర్స్ ఆ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ని విడుదల చేశారు. యువరాణి నందినిగా ఐశ్వర్యారాయ్ ఈ మూవీలో కనిపించబోతోంది. 'ప్రతీకారానికి అందమైన ముఖం..ఇదుగో పజువూరు రాణి నందిని'అంటూ మేకర్స్ ఈ పాత్రని పరిచయం చేశారు. ఐశ్వర్య అందంగా కనిపిస్తున్నా ప్రతీకారం కోసం రగిలిపోయే మహారాణిగా ఆమె పాత్ర ఇందులో చాలా ప్రత్యేకంగా వుంటుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. రాజసం ఉట్టిపడేలా ఆభరణాలతో ముగ్ధమనోహరమైన రూపంతో.. తీక్షణమైన చూపులతో కనిపిస్తున్న ఐశ్వర్య లుక్ ఆకట్టుకుంటోంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in